1984 రక్షాక్షి ఉగాది సస్పెన్స్ కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన రచన

భయంకరమైన నేరాలూ, విషాద సంఘటనలూ— ఇవన్నీ కేవలం కథల్లో, పేపర్లలో చదవాల్సిన విషయాలుగా, ఎవరో ముక్కూ మొహం తెలియని వ్యక్తులపట్ల మాత్రమే జరిగే విశేషాలుగా అనిపిస్తాయి చాలామందికి.

# పదహారేళ్ళ మనసు

మైనంపాటి భాస్కర్

ఒక వేళ అవే సంఘటనలు తమ జీవితంలోనే జరిగితే. ప్రపంచంలో కనీవినీ ఎరుగని దారుణం ఏదో జరుగుతున్న భ్రాంతి పొంది షాకయిపోతారు.

ఇప్పుడు సరిగ్గా అలాంటి స్థితిలోనే వున్నాడు కోటీశ్వరరావు.

అంతకు అయిదు నిమిషాల ముందు—

ఎర్రబాదం కాయలా ఉన్న టెలిఫోన్ వైపు చూస్తున్నాడు కోటీశ్వరరావు. తను ఎదురుచూస్తున్న కాల్ వచ్చి. ఆ డీల్ సెటిలయిపోతే. తనకు మరో ఏడు లక్షలు లాభం! ఆ ఏడు లక్షలనీ తనకి ఇప్పటికే ఉన్న తొంభై మూడు లక్షలకి కలిపితే. తను నిజంగానే కోటీశ్వరుడై పోయి. సార్థక నామధేయుడవుతాడు.

కోటీశ్వరుడనిపించుకోవడమే తనకు మిగిలిపోయిన ఒక్క కోరిక! అది తీరితే ఇంక తన జీవిత ధ్యేయం నెరవేరినట్లే!

'కోటీశ్వరుడు ... కోటీశ్వరుడు' అనుకున్నాడు కోటీశ్వరరావు మెల్లిగా. ఆ పదాన్ని ఉచ్ఛరిస్తూవుంటే. కాడ్‌బరీస్ చాక్లెట్ చప్పరించినంత మధురంగా వుంది అతనికి.

ఎర్ర ఫోను మోగింది.

ఉరకలు వేస్తున్న ఉత్సాహంతో ఫోన్ ఎత్తాడు కోటీశ్వరావు.

"నోరెత్తకుండా విను!" అంది అవతలి గొంతు మొరటుగా. రిసీవరు మీద కర్చీఫ్ వేసి మాట్లాడుతున్నట్లు అస్పష్టంగా వుంది మాట. "నీ కూతురు మా దగ్గర బందీగా వుంది. అర్థమయిందా?"

"వాట్ .... నా కూతురు ....?" అన్నాడు కోటీశ్వరరావు గాభరాగా.

"మేం ఎత్తుకొచ్చాం. డబ్బు కోసం! మీ అమ్మాయి పేరులో ఎన్ని అక్షరాలున్నాయో. అన్ని లక్షలిస్తేనే వదిలి పెట్టేది! అక్షరానికో లక్ష! అర్థమయిందా?"

"యూ ఆర్ జోకింగ్! ఎవరు మాట్లాడేదీ?" అన్నాడు కోటీశ్వరరావు తడబడుతూ. అతనికి నోరెండిపోయినట్లు అనిపించింది.

లైన్ అవతలవైపునుంచి వెటకారంగా నవ్వు వినబడింది. "నమ్మట్లేదన్నమాట! అయితే విను!"

వెంటనే. ముల్లు గుచ్చుకున్న పువ్వు విలవిల్లాడిపోతున్నట్లు కెవ్వున కేక! "డాడ్! సేవ్ మీ! ప్లీజ్! ప్లీజ్ ...." సిల్కు దారం లాంటి ఆ సన్నటి గొంతు జయంతిది.

రక్తం గడ్డకట్టినట్లయింది కోటీశ్వరరావుకి.


హఠాత్తుగా సిల్కుదారం తెగిపోయినట్లు ఆ గొంతు "కట్" అయిపోయింది.

అప్పుడు మళ్ళీ వినబడింది ఆ మోటు గొంతు. "నమ్మకం కుదిరిందా? డబ్బు ఎక్కడ. ఎలా ఇవ్వాలిందీ మళ్ళీ ఫోన్ చేసి చెబుతాను. కాచుకుని వుండు!.... ఇంకొక్కమాట! పొరపాటునయినా ఈ విషయం పోలీసులకి చెప్పావో...."

మళ్ళీ దుర్భరమైన బాధ అనుభవిస్తున్నట్లు జయంతి ఆర్తనాదం! తక్షణం లైన్ డెడ్ అయిపోయింది.

ఆ ఎయిర్ కండిషన్డ్ గది చల్లగా వున్నా. కోటీశ్వరరావు నుదుటి మీద స్వేదం చేరింది. వంట్లోని రక్తమంతా బకెట్టుతో తోడి బయట పారబోసేసినంత నిస్సత్తువగా అయిపోయింది శరీరం. తన చెవులని తనే నమ్మలేనట్లు. చేతిలోని రిసీవర్ వైపు అలాగే చూస్తూ వుండిపోయాడతను.

అలా నిశ్చేష్టుడయిపోయి కూర్చున్న



కోటీశ్వరరావుకి టేబుల్ మీదవున్న రెండో ఫోన్ మోగుతున్నట్లు కాసేపటిదాకా విని పించనేలేదు.

నల్లగా నిగ నిగలాడే చంటిపిల్లాడు గుక్క తిప్పుకోకుండా ఏడుస్తున్నట్లు మోగుతూనే వుంది.

అప్పుడు మొదటిసారిగా స్ఫురించింది కోటీశ్వరరావుకి. ఆకిడ్నాపర్ ఎవరో తన ఎర్రఫోన్ నెంబరుకి రింగ్ చేసి బెదిరించాడు! దాని నెంబరు తనతో చాలా సాన్నిహిత్యం ఉన్న వాళ్ళకి తప్ప మరెవరికీ తెలియదు. అది అసలు తన పేరు మీదే లేదు. అడ్డమైన వాళ్ళందరూ ఫోన్ చేసి తన టైముని తినెయ్యకుండా వచ్చే కాల్సు అన్నిటినీ మొదట తన సెక్రెటరీ లాలస అందుకుంటుంది. అవసరమనుకుంటేనే తనకు కనెక్షను ఇస్తుంది — ఈ నల్లఫోను ద్వారా.

ఎర్రఫోన్లో తనతో డైరెక్టుగా మాట్లాడవచ్చు — ఆ నెంబరు తెలిసిన ముఖ్యులూ, దగ్గర స్నేహితులూను. అలాంటి ఈ ఫోన్ నెంబరు ఆ కిడ్నాపర్‌కి ఎలా తెలిసింది? అంటే....? కొద్దిగా క్లూ దొరికినట్లయింది. సాలోచనగా తల పంకించి నల్లఫోన్ రిసీవర్ ఎత్తాడు కోటీశ్వరరావు.

మనసులో లేని తియ్యదనం మాటల్లో పలికిస్తూ ప్రొఫెషనల్‌గా వినబడింది తన సెక్రెటరీ లాలస గొంతు. "కాల్ ఫ్రం ముకుందలాల్ బాస్! కనబడితే కరిచేలా అరుస్తున్నాడు."

"కనెక్షన్ ఇవ్వు" అన్నాడు కోటీశ్వరరావు చిరాగ్గా. అసలు ఇందాకటి నుంచీ తను ముకుందలాల్ ఫోన్ కోసమే ఎదురు చూస్తున్నాడు. ఇంతలో ఆ కిడ్నాపర్‌గాడెవడో రంగప్రవేశం చేసి క్షణాల్లో పరిస్థితిని బీభత్సం చేసి పారేశాడు.

ముకుందలాల్ గొంతు వినబడింది. "కోటీశ్వరరావ్! నువ్వు ప్రపోజ్ చేసిన బిజినెస్ నాకు ఇష్టమే. కానీ లాభాల్లో నాకు సగ భాగం కావాలి. ఓకే?"

"నథింగ్ డూయింగ్! నూటికి ముప్ఫై మించి పైసా కూడా ఎక్కువివ్వను."

"నువ్వు చాలా గట్టి మనిషివి!" అన్నాడు ముకుందలాల్ ఏడవలేక నవ్వుతూ. 'కోటీశ్వరరావు ఈజ్ ఏ రాటెన్ సన్ ఆఫ్ ఏ బిచ్!' అని మనసులోనే తిట్టుకున్నాడు. ఆ బిజినెస్ సర్కిల్సులో కోటీశ్వరరావుని శపించనివాడు లేడు. అదను దొరికితే అతన్ని అధఃపాతాళానికి తొక్కెయ్యాలని ఉబలాటపడే శత్రువులు చాలా మంది ఉన్నారతనికి. ఆఫీసు బాయ్‌గా జీవితం మొదలెట్టి, అరడజను కంపెనీలకు ఛెయిర్మన్ అయ్యాడు కోటీశ్వరరావు. బుల్

## జీవితం

జీవితం నివ్వుల కుంపటి!
బాధామయ స్మృతుల సంపుటి!
జీవితం చిక్కని చీకటి!
సీత వదలిపోయిన పంచవటి!
జీవితం ఘోరమైన హాలాహలం!
అగ్నికి ఆ వేదనకి ఆలవాలం!
అగ్నిని మ్రింగినవాడే అమరుడు
బ్రతుకు చేతిలో ఓడితే పామరుడు
ఆ వేదనలోంచే కల్గేది అఖండ కాంతి!
చీకట్లోంచే విరిసేది అనంత సూర్యకాంతి
ఆత్మ స్థైర్యాన్ని పెంచుకో!
ఆనందామృతం పంచుకో!

—కొంగే సుధాకరరావు

డోజర్‌లా అడ్డమొచ్చిన వాడినల్లా అణిచేస్తూ తను పైకి వచ్చాడు. ముకుందలాల్‌కి కూడా అంతనంటే మంటే!

"షరతులు నచ్చితే ఏడు లక్షలు క్యాష్ పంపు. అర్జంటు!" అన్నాడు కోటీశ్వరరావు.

"ఏమిటీ? ఏడు లక్షలు క్యాషా? అర్జంటుగానా? నీకు మతిగానీ ..."

"ఇప్పుడే కావాలి. పంపు" అని ఫోన్ పెట్టేశాడు కోటీశ్వరరావు. అతని మనసులో కిడ్నాపర్ మెదులుతున్నాడు.

ఫోన్ పెట్టేసే ముందు, లైన్లో చిన్నగా ఎవరో దగ్గినట్లు వినబడింది అతనికి. ఆడ గొంతులా అనిపించింది.

నిజమేనా? లేక తను భ్రాంతి పడుతున్నాడా? తన సెక్రటరీ....లాలస.... దొంగచాటుగా వింటోందా?

ఆ అమ్మాయి చాలా ఎఫిషియెంట్ అని తను భరిస్తున్నాడుగానీ. ఆమె అంత సజావయిన మనిషికాదని తన అనుమానం. ఆమె బంధువులంతా కెనడాకి వెళ్ళిపోయి అక్కడే సెటిలయ్యారుట. తనుకూడా రేపో మాపో విమానం ఎక్కేస్తున్నట్లే పోజు కొడుతూ మాట్లాడుతూ వుంటుంది ఎప్పటికప్పుడు.

వెళ్ళిపోయేముందు లాటుగా డబ్బుకొట్టుకెళదాం అన్న దుర్బుద్ధితో ఇలా తన కూతుర్ని కిడ్నాప్ చేయించి వుంటుందా? ఎవరో బాగా తెలిసి వాళ్ళే ఈ పని చేసి వుంటారు. లేకపోతే తన డైరెక్టు లైన్‌కే ఫోన్‌చేసి ఎలా బెదిరించగలరు? అలజడిగా వుంది అతని మనసు.

అరగంట తర్వాత. ముకుందలాల్ ఎరుపు రంగు బ్రీఫ్‌కేసులో పంపిన ఏడు లక్షలు అందాయి. లేచి, సన్‌గ్లాసెస్ పెట్టుకుని బయటికి వచ్చాడు కోటీశ్వరరావు. వస్తుంటే 'ఛార్లీ' పరిమళం సున్నితంగా సోకింది లాలస వంటిమీదనుంచి. మొహం చిట్లించాడు.

నీడలు తేలేలా పాలిష్ చేసిన 'షెవీ' కారు పోర్టికోలో వుంది. కూర్చుని స్టార్ట్ చేశాడు. పావుగంట తర్వాత, చల్లటి సీరెండలో తెల్లగా మెరిసిపోతున్న ఇంటి ముందుఆగిందికారు. కారుని తనగ్యారేజిలో పెడుతూ పక్కనే వున్న గ్యారేజ్‌వైపు చూశాడు. దాన్లో తెల్లరేనాల్డ్ కారు— లేదు.

అంటే రంజని ఇంట్లో లేదన్నమాట!

ఒక్కసారి నిరుత్సాహం ముంచుకొచ్చింది కోటీశ్వరావుకి. ఇంటికి రాగానే రంజనివళ్ళోతలవాచుకుని, మనసులోని దిగులంతా బయట పెట్టేసుకోవాలన్నఆరాటంతో వచ్చాడు తను. కానీ రంజని ఇంట్లో లేదు. అది మామూలే!

అసహనంగాలోపలికెళ్ళిపోయి మేడమీద తన గదిలోకిటికీ దగ్గర నిలబడ్డాడు.

ఇంటి వెనకవైపు వున్న చిన్నగేటు దగ్గర నిలబడి ఎవరితోనో మాట్లాడుతున్నాడు వంటవాడు పరశురాం. తర్వాత అటూ ఇటూ దొంగ చూపులు చూసి, జేబులో నుంచి కొంత డబ్బు తీసి ఆ కొత్త వ్యక్తికి అందించాడు. అతను ఒక చీటీ మీద గబగబ ఏదోరాసి, పరశురాంకి అందించి వెళ్ళిపోయాడు.

అక్కడ జరుగుతున్నదేమిటో అర్థమయింది కోటీశ్వరరావుకి. మట్కా! బ్రాకెట్ ఆట!

అతని పెదిమలు ఆగ్రహంతో వణికాయి. అలగా వెధవలు! సరాసరి తన ఇంటికే వచ్చి బ్రాకెట్ నెంబర్లు బుక్‌చేసుకుని వెళ్ళే సాహసమూ వీళ్ళకి! ఈ పరశురాంగాడికి ఇదివరకు రెండుసార్లు వార్నింగ్ ఇచ్చినా వీడు మారలేదన్నమాట! కుక్కతోకలాంటి వంకరబుద్ధి వీడిది!

కుక్కతోక అనగానే మళ్ళీ రంజని గుర్తొచ్చింది. తన భార్య బుద్ధీ అలాంటిదే! ఎక్కడికి వెళ్ళి వుంటుందో?

అతను అలా ఆలోచిస్తూ వుండగానే ఫిరంగి గుళ్ళలా దూసుకు వచ్చాయి రెండు జావా మోటార్ సైకిల్సు. కోటీశ్వరరావు ఇంటి కాంపౌండునే ఆనుకుని వున్న చిన్న ఇంటి ముందు ఆగాయి.

ఆ రెండు జావాల మీద నుంచీ నాలుగు జీవాలు దిగాయి. మెడ దాకా వేళ్ళాడుతున్న జుట్లూ, వెలిసిపోయి, వంటికి కత్తుక్కుని వున్న డెనిమ్ జీన్సూ, బిగుతుగా వున్న రంగు బనీన్లూ, నిర్లక్ష్యంగా వున్న

చూపులూ—

వాళ్ళని చూస్తేనే అర్జీ కోటీశ్వరరావుకి! రోజూ వస్తూనే వుంటారు వాళ్ళు.

"హై! షివ్!" అని కేకేశాడు ఒకడు. పెడసరంగా వుంది అతని గొంతు.

ఆ "షివ్" అనబడే శివకుమార్ బయటికి వచ్చాడు. ఉన్మాదిలా కనబడతాడు అతను. అతని చేతిలో గిటార్ ఉంది. అతని పాదాలు ఎప్పుడూ కుదురుగా ఉండవు. ఎవరితోనైనా మాట్లాడుతున్నప్పుడు కూడా డాన్సు చేస్తున్నట్లు వాటిని కదుపుతూ, 'అభినవ జాన్‌ట్రవోల్టా' లాగా ప్రవర్తిస్తుంటాడు అతను.

రోడ్డు మీద తల వంచుకుని పోతున్న ఒక అమ్మాయిని చూసి సకిలించాడు వాళ్ళలో ఒకడు. "హై బేబ్! లాంగ్ టైం నో సీ!" అన్నాడు పెద్దగా.

ఆ అమ్మాయి నడక వేగం హెచ్చించింది.

వెనకనుంచీ పరుషంగా నవ్వులు.

అడ్డూ అదుపూలేని వాళ్ళ ఉత్సాహం. విశృంఖలంగా ఉన్న వాళ్ళ శక్తి చూస్తే ముదుక్కాలవకి వరదొచ్చినట్లు అనిపిస్తోంది.


తర్వాత ఆ కుర్రాళ్ళందరూ గుంపుగా 'షివ్' ఇంట్లోకి వెళ్ళారు. కొద్ది క్షణాలు గడిచాక. ఫుల్‌వాల్యూమ్‌లో స్టీరియో మోగడం మొదలెట్టింది.

ఆ 'షివ్'కుమార్ ఏదో నైట్‌క్లబ్బులో లీడ్ గిటార్ వాయిస్తుంటాడుట. అంతకు మించి వేరే పనేమీ లేదు.

'దిస్ బగర్ ఈజ్ ఆట్ టు బీ షాట్ డెడ్ లైక్ ఏ మాడ్ డాగ్! పిచ్చికుక్కని చంపినట్లు కాల్చి చంపెయ్యాలి వీణ్ణి!' అనుకున్నాడు కోటీశ్వరరావు. అప్పటికి లక్షో సారి!

కుక్క అని అనుకోగానే మళ్ళీ తన భార్య రంజని గుర్తొచ్చింది.

అనాధ అయిపోయి, మేనమామ ఇంట్లో తిండికి, బట్టకీ మొహం వాచిపోతూ బతుకుతున్న రంజనిని తను పెళ్ళి చేసుకున్నాడు.





'తల్లిని పొగొట్టుకున్న తన కూతురు జయంతి కోసం'. అని లోకానికి చెప్పినా, నిజం తన మనసుకి తెలుసు. రంజనిని మోహించి పెళ్ళి చేసుకున్నాడు తను. అద్భుతమైన అందగత్తె రంజని. కానీ, ఆమె ఒంటిమీద ఎన్ని ఒంపులున్నాయో, ఆమె బుద్ధిలో కూడా అన్ని వంకరులున్నాయని పెళ్ళయిపోయానాక తెలిసింది. కోటీశ్వరరావుకి —చాలా ఆలస్యంగా.

గూర్ఖా గేటుతెరుస్తున్న శబ్దం. తెల్లి రేనాల్డు కారు విసురుగా వచ్చి పోర్టికోలో ఆగింది. తెలుపూ, పసుపూ, గులాబీ కలిసిన రంగులో, అందమైన పింగాణీబొమ్మలా వున్న రంజని అందులోంచి దిగింది.

నిజమే! రంజని అందమైన బొమ్మ!



అంతేగాని 'అమ్మ' కాలేకపోయింది జయంతికి.

ఒకప్పుడు కట్టడానికి రెండో చీర లేకుండా బతికిన రంజని ఇప్పుడు తన కోసం రెండోబంగళా కట్టలేదనిసాధిస్తోంది. సవతి కూతురితో కలిసి ఒకే బంగళాలో ఉండటం తనకి అయిష్టంగా ఉందిట. తను ఇదివరకటి రంజని కాదు ఇప్పుడు. "హైబ్రో" సొసైటీలో చేరిపోయింది. తను సొసైటీలో పైకి ఎగబాకుతున్న కొద్దీ ఆమె జాకెట్టుకూడా పైపైకి పోవడం మొదలెట్టింది. సంకుచితమైన ఆమె మనసులా కుంచించుకుపోయి, "బ్రా" సైజుకి వచ్చేసింది జాకెట్టు. నానాటికీ దిగజారుతున్న ఆమె అభిరుచులకి అనుగుణంగా, ఆమె చీరె కూడా కిందికి జారి, నాభిని దాటి, ఇంకా కిందికి జారిపోయింది. వెంటనే మేడ మీదికి రాలేదు రంజని. దాదాపు పది నిమిషాలు గడిచాక, సందేహంగా తలుపు తెరుచుకుని లోపలికి వచ్చింది. కోటీశ్వరరావుని చూడగానే "ఎప్పుడొచ్చారు? చాలా సేపయిందా?" అంది నవ్వుతూ. ఆ నవ్వులో జీవం లేదు, బెదురు ఉంది.

రంజని మొహంలోకి పరీక్షగా చూశాడు కోటీశ్వరరావు. ఆమె పెదవులకు చిక్కగా రాసుకున్న "షాకింగ్ పింక్" కలర్ లిప్‌స్టిక్ కొద్దిగా చెదిరి, పెదిమల పక్కగా చిన్న మరకలా అంటింది. అప్పుడే సులివెచ్చటి రక్తం తాగివచ్చిన పిశాచి పెదాలకంటిన రక్తపుబిందువులా వుంది ఆ మరక! ఆమె ముంగురులలో నుంచి చెదిరి నుదుటి మీదకు జారిన ఒక పొడుగాటి వెంట్రుక ఉరితాడులా వేలాడుతోంది.

తీక్షణమైన అతని చూపులని ఎదుర్కోలేక పక్కచూపులు చూస్తూ, "వరహాలని భోజనం వడ్డించెయ్యమని చెప్పనా?" అంది రంజని.

మొహం చిట్లించాడు కోటీశ్వరరావు. భోజనం, నిద్రా, కబుర్లూ, డబ్బులూ — అంతే! అవి తప్ప ఆప్యాయతలూ, అనురాగాలూ అక్కర్లేదు రంజనికి! ఛీ!

"జయంతి ఏదీ?" అన్నాడు కటువుగా.

జయంతి పేరు వినగానే ఆకస్మాత్తుగా రంజని మొహంలో రంగు మారింది. అంతలోనే తనని తాను నిగ్రహించుకుంటూ, "ఏమో, ఎక్కడికి ఊరేగిందో? నాకేం తెలుసు?" అంది తనకు సాధ్యమైనంత పెడసరంగా.

జూలో తను చూసిన ఒక పంచవన్నెల రామచిలక గుర్తొచ్చింది కోటీశ్వరరావుకి. అంత అందంగా వుండే ఆ రామచిలక గొంతెత్తిందంటే కర్ణకఠోరంగా, రూడ్‌గా ధ్వనిస్తుంది.

ఆ రామచిలకలాంటిదే ఈ రంజని!

"కూతురెక్కడికి వెళ్ళిందో గమనించి చూడాల్సిన బాధ్యత నీకు లేదూ?" అన్నాడు గొంతు పెద్దది చేస్తూ.

"నా కూతురు కాదది! మీ కూతురు! ఆవిడగారికి అసలు నా మాటంటే లక్ష్యం వుంటేనా? ఎంతచేసినా సవితితల్లిననే ఏడుపు తప్పదుకదా?"

"షట్-అప్!" అన్నాడు కోటీశ్వరరావు. పళ్ళు గిట్టకరిచి, ఒక్కొక్క అక్షరం ఒత్తిపలుకుతూ.

రంజని అఘాయిత్యంగా వెక్కిళ్ళు పెడుతూ మంచం మీద అడ్డంగా పడిపోయి రోదించసాగింది.

కోటీశ్వరరావుకి శివమెత్తినట్లయింది. ఏదో అనబోయాడు కోపంగా. కానీ ఇంతలో తలుపు దగ్గర సన్నగా అలికిడి అయింది. తలుపు చాటున ఎవరో పొంచి వింటున్నట్లు భ్రమ కలిగింది.

రెండు అంగల్లో తలుపు దగ్గరికి చేరాడు కోటీశ్వరరావు.

అంతవరకూ తలుపుకి చెవి ఆనించి వింటున్న పరశురాం. దొరికిపోయిన దొంగలాగా గాభరాగా నిలబడ్డాడు. "భోజనం వడ్డించెయ్యనా సార్?" అన్నాడు తల బాటు కప్పిపుచ్చుకుంటూ.

"నీకు వడ్డిస్తాను వంద కొరడా దెబ్బలు! దొంగచాటుగా నిలబడి మాటలు వింటున్నావా రాస్కెల్! పైగా నా ఇంట్లోనే ఉండి క్రాకెట్ ఆట ఆడతావా బ్లడీబగర్!" అన్నాడు కోటీశ్వరరావు కొరడా ఝుళిపించినట్లు. నరసింహావతారంలా ఉన్నాడతను.

పరశురాం మొహం అవమానంతో కంది పోయింది. నౌకర్లని పురుగులాగా చూస్తాడు కోటీశ్వరరావు. నౌకర్లందరికీ అతని మీద గొంతుదాకా కసి ఉంది. "వీణ్ని అసలు పోలీసులకు అప్పగించి బాగా ఉతికిస్తేగానీ బుద్ధిరాదు!" అంటూ చకచకా ఫోన్ దగ్గరికి నడిచాడు కోటీశ్వరరావు. ఫోన్ మీద పలచగా దుమ్ము పేరుకుని ఉంది. దానిమీద స్పష్టాస్పష్టంగా నాలుగు వేలిముద్రలు కనబడుతున్నాయి. అది చూడగానే అతనికి తిక్క రేగిపోయింది." ఫోన్ తుడిచి ఎన్నాళ్ళయింది? ఏదీ పనిమనిషి? ఇలా పిలు!" అన్నాడు.

"ఎవరు? రత్నమాలా? దాని మొగుడు ఇవాళే జైల్లో నుంచీ రిలీజయి వస్తాడట. అందుకని ఇవాళ పనికి నామం పెట్టింది" అంది రంజని. అలా అంటున్నప్పుడు ఆమె గొంతులో అపహాస్యం ధ్వనించింది.

కోటీశ్వరరావు అది వినగానే ప్రళయ రుద్రుడే అయిపోయాడు. "ఏమిటీ? దాని మొగుడు ఇవాళ జైల్లో నుంచీ ... షిట్! ఈ ఇల్లు కేడీగాళ్ళకీ, జైలు పక్షులకీ సెంటరయిపోయిందా?

ఎవరు దాన్ని పనిలోకి తీసుకుంది" అన్నాడు అరుస్తూ.

"మీకు గుర్తులేదేమో! ఆ రత్నమాలని మీరే పనిలో పెట్టారు" అంది రంజని. ఆమె గొంతు విషంతో తడిసినట్లుంది.

'ఈ పనిమనిషిని తనే అపాయింట్ చేశాడా?' నొసలు చిట్లించి ఆలోచించాడు కోటీశ్వరరావు. అప్పుడు గుర్తొచ్చింది. అవును! తనే పనిలోకి తీసుకున్నాడు — ముకుందలాల్ పంపిస్తే!

చిరాగ్గా ఫోన్ ఎత్తబోయేటంతలో అదే మోగింది కర్కశంగా.

"కోటీశ్వరరావు హియర్!" అన్నాడు.

"తెలుసు! నోర్మూసుకుని విను. గుర్తుందా? మీ అమ్మాయి పేరులో ఎన్ని అక్షరాలున్నాయో అన్ని లక్షలు!"

ఎప్పుడు ఉడుంపట్టు పట్టి పంతంనెగ్గించుకోవాలో, ఎప్పుడు కాళ్ళబేరాని కొచ్చేసి

# స్వీయ రక్ష

విశాలాంధ్ర బుక్‌హౌస్‌లో
విశ్వనాథ సాహిత్యం
శ్రీశ్రీ కృత భక్తి గీత
సినీ జగత్సత్యం
మాస్కో న్యూయార్కు మధ్య
మంతనాల ఆంతర్యం
వ్యాపారపు చాతుర్యం
కుతక్కవితా సౌందర్యం
విశ్వశాంతిలో ఇమిడిన
స్వీయ రక్ష సిద్ధాంతం

—చిట్టా దామోదరశాస్త్రి

పనులు చేయించుకోవాలో కోటీశ్వరరావుకి బాగా తెలుసు. అతను మంచి బిజినెస్‌మాన్. అందుకే తగ్గిపోయి, ప్రశాంతంగా చెప్పాడు. "ఓకే! ఓకే! మా అమ్మాయి పేరు జయంతి అంటే మూడక్షరాలు! మూడు లక్షలు ఇవ్వాలన్నమాట!"

అవతల వైపునుంచి వికటంగా నవ్వు వినబడింది.

"కాదు! మీ అమ్మాయి పూర్తిపేరు జయ జయవంతి! జయంతి అని ఊరికే ముద్దు పేరు. అవునా!"

తన కూతురికి అంత పెద్దపేరు పెట్టినందుకు తనని తనే తిట్టుకున్నాడు కోటీశ్వరరావు. 'జయ జయ వంతి' అంటే ఆరు అక్షరాలు! అంటే ఆరులక్షలు! గుడ్ గాడ్!

"ఆరు లక్షలా?" అన్నాడు నిస్పృహగా.

"కాదు! ఏడు అక్షరాలు. సున్నాతో కలిపి!"

"సున్నాని అక్షరంగా లెక్కెయ్యరు!" అన్నాడు కోటీశ్వరరావు.

అవతలి వ్యక్తి దెయ్యం పట్టినట్లు నవ్వాడు.

"ఉత్త సున్నాకి విలువలేదు. నిజమే. కానీ ఒక అంకెపక్కన సున్నాలు పెట్టిన కొద్దీ కోట్లకు పెరుగుతుంది విలువ! అలాగే నీలాంటి కోటీశ్వరుడి కూతురు పేరులో వున్నప్పుడు కూడా...."

"యూ బాస్టర్డ్!" అన్నాడు కోటీశ్వరరావు మంటగా.

"యూ ఆర్ వెల్‌కమ్! రాత్రి ఎనిమిది గంటలకు జూ పార్కు దాటిన తర్వాత మూడో కిలోమీటరు రాయి దగ్గర నిలబడి వుంటాను నేను. డబ్బు బ్రీఫ్ కేసులో పెట్టి తీసుకురా! పొరబాటునకూడా పోలీసులకి రిపోర్టు ఇవ్వకు! అలా రిపోర్టు ఇచ్చావంటే, నీ కూతురి శవం తాలూకు పోస్ట్‌మార్టెం రిపోర్టు చూడాల్సివస్తుంది నువ్వు! వింటున్నావా? పొరబాటునకూడా పొరపాటు చెయ్యకు!"

లైన్ చచ్చిపోయింది. దారుణమైన నిశ్శబ్దం!

"ఎవరు?" అంది రంజని. ఆమె గొంతులో ఆదుర్దా కంటే కుతూహలం ఎక్కువ ధ్వనిస్తోంది.

"నన్నుగూడా ఒక రంకు మొగుడు తగులుకున్నాడు" అన్నాడు కోటీశ్వరరావు ఆమె మీద విసుచుకుపడిపోతూ.

వెంటనే తారాజువ్వలా లేచింది రంజని. వీళ్ళిద్దరూ అలాపోట్లాడుకుంటూ ఉండగానే వంటవాడు పరశురాం నిశ్శబ్దంగా అక్కడ నుంచి జారుకున్నాడు.

ఒక నిమిషం తర్వాత కింద జావా స్టార్ట్ అయిన శబ్దం వినబడింది.

* * *

సాయంత్రం ఏడుంపావు అవుతుండగా తన షెవీలో కూర్చుని స్టార్ట్ చేశాడు కోటీశ్వరరావు. కిడ్నాపర్‌కి ఇవ్వాల్సిన ఏడు లక్షల రూపాయలూ అతని పక్కన బ్రీఫ్‌కేసులో ఉన్నాయి. కోటీశ్వరరావు ప్రాణం ఉసూరుమంది. ఏడు లక్షలు! అప్పనంగా ఎవరో అనామకుడికి ఇచ్చెయ్యాలా ఈ డబ్బు? ఈ ఏడు లక్షలూ తనే ఉంచేసుకోగలిగితే, ఈపాటికి నిజంగానే కోటీశ్వరుడైపోయి ఉండేవాడు!

అలజడిగా ఆక్సిలేటర్ని తొక్కాడు అతను. నలభై నిమిషాల తర్వాత సంకేత స్థలం చేరింది కారు.

బ్రీఫ్ కేసుని పట్టుకుని కారు దిగాడు కోటీశ్వరరావు. చుట్టూతా పరిశీలనగా చూశాడు.

అప్పటిదాకా చెట్లకింద నీడల్లో నిలుచుని ఉన్న ఒక ఆకారం సంకోచంగా కదిలి, అడుగు ముందుకు వేసింది.

వెంటనే, కళ్ళు మిరుమిట్లు గొలిపేలా ఫ్లష్‌లైట్స్ వెలిగాయి. అది చూసి, సంతృప్తిగా నవ్వుకున్నాడు కోటీశ్వరరావు. 'సో! తను రిపోర్టు ఇచ్చిన తర్వాత అలర్టుగానే వున్నారన్న మాట పోలీసులు! చాకచాక్యంగా వచ్చేశారు అన్నిఏర్పాట్లతో! పోలీసులకి రిపోర్టు ఇవ్వవద్దని బెదిరించినంత మాత్రాన తను హడలిపోతాననుకున్నాడు ఆ కిడ్నాపర్‌గాడు! ఇంక వాడి పని పడతారు తను!'

పోలీసులని చూడగానే ఒక్క క్షణం సేపు బిగుసుకుపోయి. తర్వాత చివుక్కున వెనక్కి తిరిగి కంగారుగా చెట్లచాటుకి పరిగెత్తిపోయింది ఆ ఆకారం.

ఆ అరక్షణంలోనే అతనెవరో గుర్తుపట్టాడు కోటీశ్వరరావు. షివ్! షివ్ కుమార్! గిటార్ వాయించే కుర్రాడు! వీడా!

శివకుమార్ వెనుదిరిగి చూడకుండా పరిగెడుతున్నాడు.

"ఆగు!" అన్నారు పోలీసులు హెచ్చరికగా.

శివకుమార్ ఆగలేదు. పరిగెడుతూనే ఉన్నాడు. తుపాకులు గురిచేసి కాల్చారు పోలీసులు. "ఢిష్యూ.. ఢిష్యూ.. ఢిష్యూ." అరడజను తూటాలు నిప్పుల్లా కాలుస్తూ అతని వీపులో దిగబడ్డాయి.

ఒక్కసారి ఎగిరిపడి, విలవిల్లాడుతూ నేలకొరిగాడు శివకుమార్.

అప్పుడు జరిగింది ఊహాతీతమైన సంఘటన. సిల్కు దారం మెలితిరిగి పోతున్నట్లు కెవ్వున కేక వినపడింది.

వెంటనే పట్టరాని దుఃఖంతో హృదయ విదారకంగా ఏడుస్తూ తను దాక్కున్న చెట్ల చాటునుంచి పరుగెత్తివచ్చి శివకుమార్ శవం మీద వాలిపోయింది ఒక అమ్మాయి.

నిర్ఘాంతపోయి చూస్తున్నాడు కోటీశ్వరరావు.

## అశ్రుశిఖ

కన్నీటి బొట్టు అంటే
కానరాని భయం నాకు
కారి, కారి చెంపలపై
చారికలు కడుతుందని కాదు
— కారి, కారి
కడలిగా మారి
బడబాగ్నులు ఊరి
ప్రళయాన్నే
ప్రసవించగలదేమోనని

—భండారు పర్వతాలరావు

ఫ్లడ్‌లైట్ వెలుగులో స్పష్టంగా కనబడుతున్న ఆ అమ్మాయి- జయంతి, తన కూతురు!

దుఃఖంతో వివశురాలైపోయి శివకుమార్ మృతదేహాన్ని కావలించుకుని గుండెలు పగిలేలా ఏడుస్తోంది జయంతి.

కోటీశ్వరరావు మెదడు మొద్దుబారిపోయింది. కళ్ళప్పగించి చూస్తున్నాడు.

"నువ్వు తండ్రివి కావు. నరరూపరాక్షసుడివి!" అంటోంది జయంతి రోదిస్తూ.

"జయంతీ!" అన్నాడు కోటీశ్వరరావు. మాటలు కూడదీసుకుంటూ.

"నువ్వు తండ్రివి కావు! డబ్బు. అధికారం తప్ప మమకారం అంటే తెలియని వాడివి! నీకు తగినదే నీ భార్య! నీకు డబ్బూ. నీ పెళ్ళానికి క్లబ్బూ తప్ప మరేం పట్టవు. పిల్లలకి డబ్బు మాత్రమే కాదు— ఆప్యాయతా, అభిమానం కూడా కావాలని గ్రహించని డబ్బు రాక్షసుడివి నువ్వు! ఆప్యాయత కోసం అలమటించిపోతున్న నాకు స్నేహం, అభిమానంఅంటే ఏమిటో రుచి చూపించాడు నా షివ్! మమకారం కోసం తపించిపోతున్న నాకు అనురాగపు టంచులు చూపించాడు. నా కోసం ప్రాణాలయినా పెట్టడానికి తయారుగా ఉన్నానని చెప్పాడు. ఇవాళ నిజంగానే నా కోసం ప్రాణాలు వదిలాడు నా షివ్!" దుఃఖంతో గొంతు పూడుకుపోయింది జయంతికి. గుండెలు ఎగసిపడుతున్నాయి.

"జయంతీ........" అని ఏదో చెప్పబోయాడు కోటీశ్వరరావు. అతని మాటని సగంలోనే తుంచేసింది జయంతి. "కొన్ని లక్షలు నీ దగ్గరనుంచి ఏదో విధంగా రాబట్టి నీకూ నీ పెళ్ళానికీ దూరంగా, నా షివ్‌కి దగ్గరగా ఎక్కడన్నా బతకాలనుకున్నాను. ఈ కిడ్నాప్ నాటకాన్ని నేనే ఆడించాను. ఈ అయిడియా నాదే!

"అప్పుడు కూడా- నీ కూతురి ప్రాణం ఆపదలో వున్నప్పుడు కూడా— నువ్వు పక్కా వ్యాపారస్థుడిలాగే ప్రవర్తించావు! సున్నాకి ఓ లక్ష తగ్గించమని బేరమాడావు! నీకు అసలు మనసు అనేది సున్నా! పోలీసులకి రిపోర్టు ఇస్తే నీ కూతుర్ని చంపేస్తామని బెదిరించినా, ఏడులక్షలు మిగుల్చుకోవడం కోసం పోలీసు రిపోర్టు ఇచ్చావు!"

"షివ్ ఉత్తుత్తగా ఏమని బెదిరించాడు కోటీశ్వరరావ్ నిన్ను? పోలీసు రిపోర్టు ఇస్తే నీ కూతురి పోస్టుమార్టెమ్ రిపోర్టు కళ్ళ జూడాల్సి వస్తుందనేగా? సరిగ్గా అదే నిజమవుతుంది. చూడు ఇప్పుడు!"

కోటీశ్వరరావు కదిలే లోగానే మెరుపులా తన జెర్కిన్ జేబులోనుంచి రివాల్వరు తీసింది జయంతి. దాన్ని తన కణతలకు గురిపెట్టి కాల్చేసుకుంది. తర్వాత నెమ్మదిగా, తన ప్రియుడు శివకుమార్ శవం మీదికి రక్తతర్పణం చేస్తూ జారిపోయింది.

పూర్తిగా వికసించకుండానే రాలిపోయిన ఆ మొగ్గది పదహారేళ్ళ మనస్సు. *



శ్రీ త్యాగరాయ సంగీత కళాసమితి (విజయవాడ) ఆధ్వర్యంలో ఇటీవల నృత్యప్రదర్శన ఇచ్చిన కుమారి జ్యోతిర్మయి